ప్రజాశక్తి

గురువారం 13 జూన్ 2024 5 విజయనగరం

రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం కోట

జాబ్ డీలర్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు బిసికాలనీ ప్రభుత్వ ఐటిఐలో ఈ జాబ్ మేళా జరుగుతుందని తెలిపారు. జాబ్ డీలర్స్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలో ఫ్రంట్ ఆఫీసు, టెలి కాలింగ్, హెల్పర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్స్, డ్రైవర్స్ మొదలగు 150 ఉద్యోగాలు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో అసిస్టెంట్ మేనేజర్, అడ్వయిజర్స్, పార్టనర్స్ తదితర 50 ఉద్యోగాల భర్తీ జరుగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పేర్లను ముందుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సిఎస్.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లోని జాబ్ సీకర్స్ లాగిన్‌లో నమోదు చేసుకొని, ఈనెల 15వ తేదీ ఉదయం 10గంటలకు ప్రభుత్వ ఐటిఐలో జరిగే ఇంటర్వ్యూకు, సంబంధిత సర్టిఫికేట్ కాపీలు, రెండు పాస్ ఫొటోలతో హాజరు కావాలని కోరారు. వివరాల కోసం 8919179415 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

శ్రీనివాస్, సంధ్యారాణిలకు మంత్రి పదవులు

సీనియర్లకు తప్పని నిరాశ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి రాష్ట్ర మంత్రివర్గంలో ఎవరికి చోటు లభిస్తుందన్న దానిపై ఉత్కంఠ వీడింది. గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్, సాలూరు ఎమ్మెల్యే సంధ్యారాణిలకు మంత్రి పదవులు వరించాయి. ఈ మేరకు వీరిద్దరూ రాష్ట్ర మంత్రులుగా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇంకా శాఖలు కేటాయించాల్సివుంది. మంత్రి పదవులు వరించడంతో వీరి అనుయాయులు ఆనంద డోలికల్లో మునిగితేలుతున్నారు. సీనియర్ ఎమ్మెల్యేలు, మంత్రుల్లో మాత్రం నిరాశ నెలకొంది. శ్రీనివాస్ రాజకీయ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి కొద్ది నెలల క్రితమే వచ్చి, నేరుగా ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిచి విజయం సాధించడం, తొలి విజయంతోనే రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు లభించడం జిల్లాలో సంచలనంగా మారింది. ఎక్కడ చూసినా శ్రీనివాస్‌కు వచ్చిన రాజకీయ అవకాశాలపైనే చర్చ నడుస్తోంది. మంచి పాలన అందించడంతోపాటు జిల్లాను ప్రగతి పథంలో నడిపించ గలిగితే ఆయనకు రాజకీయంగా మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రజలు చర్చించు కుంటున్నారు. అటు సంధ్యారాణి తప్పకుండా మంత్రి అవుతారంటూ అందరూ ఉహించినట్టే జరిగింది. టిడిపిలో యువతను ప్రోత్సహించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో 30శాతం మంది యువకులైన కొత్తముఖాలకు ఎమ్మెల్యే సీట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా శ్రీనివాస్‌కు సీటు లభించింది. దీనికితోడు సామాజిక తరగతి కూడా కలిసిరావడంతో శ్రీనివాస్‌ను మంత్రి పదవి వరించింది.

అనూహ్యంగా మంత్రి పదవి దక్కించుకున్న శ్రీనివాస్

గజపతినగరం నియోజకవర్గం నుంచి ఎన్నికైన శ్రీనివాస్‌ను మంత్రి పదవి అనూహ్యంగా వరించింది. దీంతో ఆయన నియోజకవర్గం నుంచి మంత్రి పదవులు పొందిన వారిలో రెండోవ్యక్తిగా నిలిచారు. 1983లో టిడిపి ఆవిర్భావం తరువాత ఇప్పటి వరకు పది ఎన్నికలు జరిగాయి. ఇప్పటి వరకు టిడిపి ఆరుసార్లు విజయం సాధించింది. 1983లో టిడిపి నుంచి జెఎస్‌న్ రాజు గెలవగా, 1985లో కాంగ్రెస్ తరపున వంగపండు నారాయణప్పల నాయుడు విజయం సాదించారు. ఆ తరువాత 1989, 1994, 2004లో పడాల అరుణ విజయం సాధించారు. ఈ సమయంలో ఆమె రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా వనిచేశారు. గజపతి నగరం నియోకవర్గానికి మంత్రి పదవి రావడం అదే తొలిసారి. తాజా ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి అప్పలనర్సయ్యపై టిడిపి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ 25,304 ఓట్ల ఆదిక్యంతో విజయం సాధించారు. 1980 దశకానికి ముందు జరిగిన ఎన్నికల్లో ఇక్కడి నుంచి కాంగ్రెస్, సోషలిస్టు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా అనేక మంది పోటీచేసినప్పటికీ మంత్రి పదవులు దక్కలేదు. ఈ రకంగా గజపతినగరం నియోజకవర్గం నుంచి శ్రీనివాస్ రెండో మంత్రిగా చెప్పుకోవచ్చు.

కలిసొచ్చిన రాజకీయ వారసత్వం

శ్రీనివాస్ తొలి ప్రయత్నంలోనే మంత్రి కావడం వెనుక కుటుంబ రాజకీయ వారసత్వం కలిసొచ్చింది. ఆయన తాత కొండపల్లి పైడితల్లి నాయుడు టిడిపి ఆవిర్భావం నుంచి టిడిపిలో ఉన్నారు. బొబ్బిలి ఎంపీగా మూడుసార్లు ఎన్నికయ్యారు. ఒకసారి జిల్లా పరిషత్ చైర్మన్‌గా, సుదీర్ఘకాలం ఉమ్మడి విజయనగరం జిల్లా పార్టీ అధ్యక్షునిగా పనిచేశారు. ఆతరువాత ఆయన చిన్నాన కెఎ నాయుడు రెండు దఫాలు గజపతినగరం నుంచి పోటీచేసి ఒకసారి విజయం, మరోసారి అపజయం పొందారు. తండ్రి కొండపల్లి కొండలరావు గంట్యాడ ఎంపిపిగా పనిచేశారు. తాజా ఎన్నికలు శ్రీనివాస్‌ను ఏకంగా రాష్ట్ర మంత్రిగా చేశాయి.

సాలూరు నుంచి మూడో మంత్రిగా సంధ్యారాణి

సాలూరు నియోకవర్గం నుంచి మూడో మంత్రిగా గుమ్మడి సంధ్యారాణి అవకాశం దక్కించుకున్నారు. టిడిపి ఆవిర్భావం తరువాత వరుసగా జరిగిన రెండు సాధారణ ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన బోయిన రాజయ్య మంత్రిగా పనిచేశారు. ఆ తరువాత గత ఎన్నికల్లో వైసిపి తరపున గెలిచిన పీడిక రాజన్నదొర ఇదే నియోజకవర్గం నుంచి మంత్రిగా, డిప్యూటీ సిఎంగా పనిచేశారు. తాజాగా సంధ్యారాణికి మంత్రి పదవి వరించింది. గుమ్మడి సంధ్యారాణి సాధారణ కార్యకర్త నుంచి మంత్రి వరకు ఎదిగారు. 2009లో టిడిపిలో చేరిన ఆమె తెలుగు మహిళా జిల్లా అధ్యక్షులుగా పనిచేశారు. 2015 - 21 వరకు ఎమ్మెల్సీగా పనిచేశారు. 1999లో కాంగ్రెస్ తరపున, 2009లో టిడిపి తరపున, 2014లో టిడిపి తరపున ఎంపీగా కూడా పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఇలా అనేక సార్లు ఓటమి పాలైనప్పటికీ వెరవలేదు. మొక్కవోని దీక్షతో రాజకీయాల్లో కొనసాగుతూ వచ్చారు. ప్రస్తుతం టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలిగా కూడా ఉన్నారు.

నేటి నుంచి మోగనున్న బడిగంట

- స్వాగతం పలికేందుకు పాఠశాలలు సన్నద్ధం
- పూర్తికాని రెండోదశ నాడు-నేడు పనులు
- విద్యార్థులకు తప్పని వసతి సమస్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో గురువారం నుంచి బడి గంటలు మోగనున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. 50 రోజులు పాటు పుస్తకాలు మూలన పడేసిన విద్యార్థులు నేటి నుంచి స్కూల్ బ్యాగ్ నిండా పుస్తకాలు, చేతిలో క్యారేజీ, సైకిల్ మీద, ఆటోల్లో, బస్సుల్లో బడికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. విద్యా శాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు ఘన స్వాగతం పలికేందుకు పాఠశాలలను సిద్ధం చేశారు. జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలు 1316 స్కూళ్లు, ప్రాథమికోన్నత పాఠశాలలు 184, హైస్కూళ్లు 310 ఉన్నాయి మొత్తం 1801 పాఠశాలలు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉండగా. ప్రైవేటు విద్యా సంస్థలలో ప్రాథమిక పాఠశాలలు 127, ప్రాథమికోన్నత పాఠశాలలు 149, హై స్కూళ్లు 155 ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో బాలురు 67,604 మంది, బాలికలు 73,875 మంది మొత్తం 1,41,479 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో మొత్తంగా 91,996 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 7672మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

1751 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు

రాష్ట్ర ప్రభుత్వం 1751 పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోంది. జిల్లాలో మొత్తం 1,26,599మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నారు.

నిలిచిపోయిన నాడు నేడు రెండో దశ పనులు

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రారంభించిన మనబడి నాడు-నేడు కార్యక్రమం నిధుల కొరతతో పడకేసింది. పనులు అస్తవ్యస్థంగా ఉండడంతో పాఠశాల భవన నిర్మాణాలు పూర్తి కాలేదు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 737 పాఠశాలల్లో రూ.231.24 వేల కోట్ల అంచనాతో నాడు-నేడు రెండో విడత పనులను 2021 ఆగస్టులో ప్రారంభించారు. మూడు ఏళ్ల దాటిపోయినా ఇప్పటివరకూ విడుదల చేసిన నిధులు కేవలం రూ.49.59 కోట్లే. మిగిలిన నిధుల విడుదలకు ఎంతకాలం పడుతుందో తెలియని పరిస్థితి కనిపిస్తోంది. వైసిపి ప్రభుత్వం ఓడిపోయి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాలి. పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు వసతి సమస్య కలగనుంది.

63 స్కూళ్లలో సిబిఎస్ఇ సిలబస్

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రాష్ట్ర విద్యతో పాటు కేంద్రీయ విద్యావిధానం అమలు చేయడంలో భాగంగా జిల్లాలో 63 పాఠశాలల్లో ఈ ఏడాది నుంచి సిబిఎస్ఇ సిలబస్‌ను అమలు చేస్తున్నారు. గత ఏడాది నుంచి దీన్ని అమలు చేస్తున్నారు.

ఏడు ఉన్నత పాఠశాలల్లో ఇంటర్ తరగతులు ప్రారంభం

జిల్లాలో ఏడు ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ కళాశాలల్లో ఈఏడాది నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఎస్.కోట మండలం ధర్మవరం హైస్కూల్లో గతఏడాది నుంచి జూనియర్ ఇంటర్ తరగతులు ప్రారంభం కాగా, ఈ ఏడాది మరో ఆరు హై స్కూళ్ల జామి, కోనూరు, రామభద్ర పురం, ఎ.వెంకటాపురం, బొండపల్లి, పిరిడిలో ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులకు ఈ ఏడాది నుంచి ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది.

జిల్లాలో 1,28,198 మందికి స్టూడెంట్ కిట్‌లు : డిఇఒ



ఈనెల 13నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న దృష్ట్యా విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేయడానికి సిద్ధం చేసినట్లు జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్ కుమార్ తెలిపారు. మంగళవారం నాటికి 20 శాతం వరకు నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బెల్టు, షూస్ తదితర సామాగ్రిని పాఠశాలలకు చేరవేసినట్లు తెలిపారు. జిల్లాలో 1,28,198 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ రూపంలో యూనిఫారాలు, బూట్లు, సాక్స్‌లు, బెల్ట్, స్కూల్ బాగ్, నోట్ పుస్తకాలు, టెక్స్ట్ పుస్తకాలు ఇస్తామని తెలిపారు. మొత్తం కిట్లు రెండు మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో జిల్లాకు చేరనున్నాయని, వెంట వెంటనే విద్యార్థులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

40 శాతం వైన్‌షాపులను కేటాయించాలి

ఆంధ్రప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తెలుగుదేశం పార్టీ హామీ ఇచ్చిన విధంగానే రాష్ట్రంలో ఉన్న కల్లుగీత కార్మికులకు 40శాతం వైన్ షాపులను కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం విజయనగరం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. బుధవారం కెఎల్‌పురంలోని సిఐటియు కార్యాలయంలో గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జమ్మల అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిమ్మ అప్పారావు, జిల్లా కన్వీనర్ కొలుసు శ్రీను మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం యాత సాధికారత కార్పొరేషన్ చైర్మన్ పదవిని విజయనగరం జిల్లాకు కేటాయించాలని డిమాండ్ చేశారు. వైన్ షాపుల్లో ఉద్యోగులుగా కల్లు గీత కార్మిక కుటుంబాలకే అవకాశం కల్పించాలన్నారు. కల్లుగీత కార్మికులకు రూ.4వేలు ఫించను, చంద్రన్న భీమా కింద పది లక్షలు ఇవ్వాలన్నారు. గీత కార్మికులను ఇబ్బంది పెట్టే జిఒ నెంబర్ 677ను రద్దు చేయాలన్నారు. యాత కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో బంజరు భూమి, ఈనాం భూములు ప్రభుత్వ చెరువు గట్ల పై ఉన్న తాటి చెట్లను కల్లు గీత కార్మికులకు కేటాయించాలన్నారు. గీత కలుస్తుల విద్యార్థులకు విద్యా పథకం కింద విదేశీ విద్య రుణ సదుపాయంకల్పించాలన్నారు. కల్లు గీత కార్మికులకు సామాజిక భవనాలు నిర్మించాలని కోరారు. కల్లును మత్తు పదార్థాల జాబితా నుంచి తొలగించి శీతల పానీయాలుగాగుర్తించాలన్నారు. సమావేశంలో ఆ సంఘం కోశాధికారి బంగారు నాయుడు, యాత సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొర్లె సూరిబాబు, శెట్టి బలిజ సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు గుత్తుల మధు సూధన్ రావు, సొసైటీ ప్రెసిడెంట్లు అప్పల స్వామి, జి.దేవుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

లాకౌట్ ఎత్తివేయకపోతే ఆందోళన ఉధృతం

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-కొత్తవలస

27రోజులుగా జిందాల్ కర్మాగారం మూతపడి కార్మికులు ఆందోళన చేస్తున్నా యాజమాన్యం స్పందించకపోవడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. కంపెనీలో పనిచేస్తున్న కార్మికులను లాకౌట్ పేరుతో బయటకు నెట్టడం సరైన పద్ధతి కాదని, భేషరతుగా లాకౌట్ ఎత్తివేసి కార్మికులందరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిందాల్ పరిశ్రమ వద్ద కార్మికులు చేస్తున్న నిరసన శిబిరంలో పాల్గొన్న తమ్మినేని ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఎంతో నమ్మకంగా పనిచేస్తున్న కార్మికులను పొమ్మన లేక పొగ పెట్టడం విచారకరమని అన్నారు. యాజమాన్యం తీరు సక్రమంగా లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక శాఖ అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇక్కడ పనిచేస్తున్న కార్మికుల శ్రమను 40 సంవత్సరాలుగా దోచుకుని, ఇప్పుడు జాజిపూర్ వెళ్లాలని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. కార్మికులు సహనం, ఓర్పుతో వేచి చూస్తున్నారని, యాజమాన్యం దిగి రాకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. జిందాల్ కార్మికుల సమస్యను టిడిపి ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిందాల్ మేనేజ్‌మెంట్‌పై తమకు పూర్తి నమ్మకం, విశ్వాసం ఉందని, టాప్ మేనేజ్‌మెంట్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ పరిశ్రమలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, భేషరతుగా కంపెనీని తెరవడానికి యాజమాన్యం ముందుకు రావాలని, లేఆఫ్ కాలానికి కార్మికులకు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టివి రమణ, వ్యవసాయ కార్మిక సంఘంజిల్లా అధ్యక్షులు గాడు అప్పారావు జిందాల్ యూనియన్ సిఐటియు నాయకులు నమ్మి చిన్నబాబు, బాలిబోయిన ఈశ్వరరావు, టిఎన్‌టియుసి నాయకులు పిల్లా అప్పలరాజు, బోసాల అప్పారావు, సలాది భీమయ్య, వైఎస్ఆర్టియుసి నాయకులు లగుడు వామాలు, కార్మికులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు

బిసిజి టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-విజయనగరం కోట

వయోజనుల బిసిజి టీకా కార్యక్రమం విజయవంతానికి ఆరోగ్య సిబ్బందితోపాటు అర్హులైన వారు కూడా ముఖ్య భూమిక పోషించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. బుధవారం డిఎంహెచ్ఒ కార్యాలయంలో బిసిజి టీకా గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు ప్రత్యేక కేంద్రాల్లో గుర్తించిన వయోజనులకు ప్రతి గురువారంతో పాటు ప్రతి సోమవారం కూడా బిసిజి టీకాను అన్ని ఆరోగ్య కేంద్రాల వేస్తున్నట్లు తెలిపారు. 60ఏళ్లు పైబడిన వారు మధుమేహ వ్యాధిగ్రస్తులు, ధూమపానం అలవాటు ఉన్నవారు, గత ఐదేళ్లలో టిబి సోకి తగ్గిన వారు, బిసిజి టీకాకు అర్హులని తెలిపారు. టీకా తీసుకున్న తరువాత సంబంధిత వ్యక్తులు గోకడం, రుద్దడం చేయరాదని తెలిపారు. వయోజనుల కు వేయడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఎల్‌టిఒ డాక్టర్ కె.రాణి, డాక్టర్ వెంకటేష్, డిపిహెచ్ఎన్ఒ సత్యవతి, డిప్యూటీ డెమో రమణ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి

ర్యాలీని ప్రారంభిస్తున్న కేసలి అప్పారావు

ప్రజాశక్తి-విజయనగరం కోట

అంత ర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం కోట జంక్షన్ నుండి మూడు లాంతర్లు వరకు బాలలు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేకంగా బాలలను పనిలో పెట్టుకుంటే వారిపై. భారీ గా జరిమానాలు విధించి, శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని, హెచ్చరించారు. డిసెంబర్ - 25 నాటికి పూర్తి స్థాయిలో బాలకార్మికులు లేని రాష్ట్రంగా తీర్చి దిద్దడానికి అందరి భాగస్వామ్యంతో ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటామని, గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలు ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేసి బాలకార్మిక వ్యవస్థను నిర్మూలన చేస్తున్నామని తెలిపారు. బాలల భద్రతకు, రక్షణకు, సంరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేసి వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ జి.హిమబిందు, వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు, దిశా పోలీసుస్టేషన్ సిఐ నర్సింగరావు, జిల్లా కార్మిక శాఖ అధికారులు ఎన్ .సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, చంద్ర శేఖర్, శ్రీనివాసరావు, కిరణ్, ఐసిడిఎస్ పీడీ జి.ప్రసన్న, మిషన్ వాత్సల్య సిబ్బంది యాళ్ల నాగరాజు, రామకోటి, వెంకటరావు, అప్పారావు,చైల్డ్ లైన్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారం

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని కలెక్టరేట్ ఆడిటోరియం నుంచి తిలకిస్తున్న అధికారులు, ఉద్యోగులు



ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం బుధవారం బాధ్యతలు చేపట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, ఇతర మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు ప్రముఖులు, కేంద్ర మంత్రులు, కేంద్ర రాష్ట్ర ఉన్నతాధికారుల సమక్షంలో, నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, ఇతర మంత్రివర్గ సహచరులతో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయించారు. గన్నవరం సమీపంలోని కేసరిపల్లిలో అత్యంత వైభవంగా జరిగిన ఈ కార్యక్రమాన్ని, జిల్లా అంతటా మున్సిపల్, మండల కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. విజయనగరం జిల్లా నుంచి కొండపల్లి శ్రీనివాసరావు, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి గుమ్మడి సంధ్యారాణి మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర మంత్రి వర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, డిఆర్ఒ ఎస్‌డి అనిత, ఎస్‌డిసి సుమబాల, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, డిఇఒ ప్రేమ్ కుమార్, సిపిఒ పి.బాలాజీ, జెడిఎ వి.టి.రామారావు, జెడి ఎహెచ్ డాక్టర్ విశ్వేశ్వర రావు, జిఎస్‌డబ్ల్యుఎస్ స్పెషల్ ఆఫీసర్ నిర్మాలాదేవి, అధికారులు, ఎపిఎంఐపి పీడీ లక్ష్మి నారాయణ, ట్రాన్స్ కో ఎస్ఇ లక్ష్మణరావు, సివిల్ సప్లయి డిఎం మీనా కుమారి, మైన్స్ ఎడి పూర్ణ చంద్రరావు, ఐఅండ్‌పిఆర్ ఎడి డి.రమేష్ తదితర అధికారులు, ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు తిలకించారు. ఆనందగజపతి ఆడిటోరియంలో కూడా ఎల్ఇడి స్క్రీన్ ద్వారా ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ ఎం. మల్లయ్య నాయుడు, ఎంపిడిఒ గంటా వెంకట రావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్‌సిఎస్ సినిమా హాల్‌లో చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. అనంతరం టిడిపి నాయకులు స్వీట్లు పంచుకుని తినిపించుకున్నారు.



ఉద్యోగులకు ధ్రువపత్రాలు మంజూరు చేయాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగులకు ధ్రువపత్రాలు అందచేయాలని ఎపిటిఎఫ్ (1938) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి నీ కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన డిఆర్ఒ అందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేస్తున్నట్లు తెలిపారు. రకరకాల ఇడి సిలు కాకుండా పిఒ, ఎపిఒలకు ఐదు రోజులు, ఒపిఒలకు మూడు రోజులు, హోం ఓటింగ్ విధులకు రెండు రోజులు డ్యూటీ సర్టిఫికెట్లు జిల్లా అంతటా ఒకే విధంగా జారీచేయాలని నాయకులు విజ్ఞప్తి చేసారు.డిఆర్ఒ స్పందించి వెంటనే ఆర్ఒలకు ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిరాజు అకడమిక్ కన్వీనర్ పి.బాబూలాల్ , విజయనగరం మండల శాఖ అధ్యక్షులు సిహెచ్ పైడితల్లి పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌కు ఇఒగా బాధ్యతలు

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం మేజర్ పంచాయతీ ఇఒగా ఇదే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మొంగం సురేష్‌కు అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి నోట్ ఉత్తర్వులు మేరకు ఎంపిడిఒ చంద్రకళ బుధవారం ఆదేశాలను జారీ చేశారు. ఇక్కడ పని చేసిన రామకృష్ణ నాయుడుకు గ్రేడ్ వన్ కార్యదర్శిగా పదోన్నతి రావడంతో విశాఖ జిల్లా ఆనందపురం పంచాయతీకి బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని గర్భాం ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతులలో చేరేందుకు మిగులు సీట్లు భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ డివిఎస్ అరుణ తెలిపారు. ఆయా తరగతుల ప్రవేశం కొరకు 14వ తేదీన దరఖాస్తు చేసుకుంటే 15వ తేది ఉదయం 10 గంటల నుంచి 11గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు విద్యుత్తుకు అంతరాయం

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి విద్యుత్ సరఫరా పనులు కారణంగా సుమారు 10 గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ గ్రామీణ ఇ.ఇ జి.సురేష్ బాబు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందన్నారు. ఏ రావివలస, గూడెపు వలస, దల్లిపేట, రెడ్డి కంచెరు, బైరెడ్డి పాలెం, ముగడపేట, ఆర్.ఆర్ కాలనీ, చాకి వలస, సన్‌రే విలేజ్‌తో పాటు విమానాశ్రయం ప్రాంతంలో విద్యుత్ ఉండదని తెలిపారు.

కుడుమూరు రైతులపై కేసులు ఎత్తివేయాలి

ప్రజాశక్తి-సాలూరు

సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని పోరాడుతున్న రైతులు, మద్దతు తెలుపుతున్న నాయకులపై గత ప్రభుత్వం పెట్టిన కేసులు ఎత్తివేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, మాజీ వైస్ ఎంపిపి టి.గౌరీశ్వరరావు, సర్పంచ్ సింహాచలం డిమాండ్ చేశారు. బుధవారం సాలూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ పాచిపెంట మండలంలో సర్వే నెంబర్-48లోని భూములను అనేక సంవత్సరాలుగా గిరిజనులు సాగు చేస్తున్నారని చెప్పారు. ఆ భూములపై కన్నేసిన కొంతమంది బడాబాబులు.. అవి మొఖాసాదారులవని వాదిస్తున్నారని చెప్పారు. ఇప్పటికీ రైతులను బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో భూముల సర్వే జరిగిందని, అవి ప్రభుత్వ భూములని అధికారులే ప్రకటించారని గుర్తుచేశారు. ఇప్పటికైనా సాగుదారులకు పట్టాలు పంపిణీ చేయాలని కోరారు.

వైద్యసేవలపై కేంద్ర బృందం ఆరా

ప్రజాశక్తి-పాచిపెంట

పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్రబృందం బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి బృందం సభ్యులు ఆరా తీశారు. ముఖ్యంగా ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయా? లేదా? అని వైద్యాధికారి జి.వెంకట రమణను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన మందులు పంపిణీ, దస్త్రాల నిర్వహణ, సిబ్బంది పనితీరు, పిహెచ్‌సితోపాటు సబ్ సెంటర్లో అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో వైద్యసేవలు గుర్తించేందుకు పి.కోనవలస సబ్ సెంటర్‌ను పరిశీలించారు. బృందంలో డాక్టర్ బాలు మోటో. డాక్టర్ హిమక్కౌర్ డాల్‌తోపాటు రాష్ట్ర అధికారులు. డాక్టర్ శాంతి సౌందర్య, డాక్టర్ పిఎల్ రఘుకుమార్ తదితరులు ఉన్నారు.

పరిమితికి మించితే చర్యలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా అధికారి శశి కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా అధిక ప్రయాణికులతో ప్రయాణిస్తున్న ఆటోలను ప్రత్యేక తనిఖీలను నిర్వహించి, 37 ఆటోలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వాహన పత్రాలు లేని కొన్ని ఆటోను సీజ్ చేసినట్లు చెప్పారు. జిల్లాలో 81 స్కూల్, కాలేజీ బస్సులలో ఇంతవరకు 60 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. మిగతా యాజమాన్యాలు వాహన తనిఖీలు చేయించుకోవాలని సూచించారు.

వసతిగృహాల్లో స్ప్రేయింగ్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

వసతిగృహాల్లో దోమల నివారణ మందు పిచికారీ (స్ప్రేయింగ్) పూర్తి కావచ్చిందని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు తెలిపారు. బుధవారం మలేరియా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వసతిగృహాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జిల్లాలోని గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో దోమల మందు స్ప్రేయింగ్ చేయించినట్లు తెలిపారు. తద్వారా పాఠశాలల ప్రారంభం నాటికి దోమల ప్రభావం తగ్గి విద్యార్థుల్లో సీజనల్ జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. ఇప్పటికే మలేరియా ప్రభావిత గ్రామాల్లో మొదటి విడత దోమల మందు పిచికారీ కొనసాగుతుందన్నారు. 287 గ్రామాల్లో పూర్తి కావచ్చిందని తెలిపారు. ఇంకా 114 గ్రామాల్లో చేపట్టాల్సి ఉందని వివరించారు. వసతిగృహాల పరిధిలో వైద్య సిబ్బంది వద్ద అవసరమైన జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. పలు గ్రామాల నుండి హాస్టళ్లలో చేరే విద్యార్థుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది దృష్టిసారించాలన్నారు.

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

పార్వతీపురం మన్యం జిల్లా ఫిజికల్ సైన్స్ టీచింగ్ డైరీని బుధవారం డిఇఒ పగడాలమ్మ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల ఫోరం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు సైన్స్‌పై ఉండే భయాందోళన తొలగించే చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా సైన్స్ అధికారి గిరడ లక్ష్మణరావు రూపకల్పన చేసిన ఈ డైరీ 240 పేజీలతో వినూత్నంగా తయారు చేశారు. అన్ని అంశాలు డైరీలో పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ పెంట రామకృష్ణ, ఎఎంఒ శ్రీనివాసరావు, ఎఎస్‌ఒ రామకృష్ణ, ఎపిఒ హరిప్రసాద్, మన్యం జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు సతీష్ రాజు, బెహరా సంతోష్, పెదప్రోలు శైలజ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

'చేయూత'పై స్పష్టత ఇవ్వాలి

ప్రజాశక్తి-కొమరాడ

జగనన్న చేయూత పథకం కింద డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారా? లేదా? స్పష్టత ఇవ్వాలని సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం కొమరాడ మండల కేంద్రంలోని సచివాలయం వద్ద చేయూత లబ్ధిదారులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కొమరాడ మండల కేంద్రంలో సుమారు 60 మందికి పైగా జగనన్న చేయూత డబ్బులు అందక రెండు నెలలుగా బ్యాంకులు, సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో తమకు డబ్బులు వస్తాయో, రావోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. వెంటనే అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు.

జాబ్‌మేళాలో 75 మంది ఎంపిక

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఎల్అండ్‌టి కంపెనీలో ఉద్యోగ అవకాశాలకు భద్రగిరి ఆర్ఐటిఐలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు 100 మంది హాజరయ్యారు. వీరిలో 75 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ తెలిపారు. ఐటిఐ పాసైన 10 మంది, ఇంటర్మీడియట్ పాసైన నలుగురు ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఐటిఐ రెండో సంవత్సరం చదువుతున్న 61 మంది విద్యార్థులు జాబ్‌మేళాలో ఎంపికైనట్లు చెప్పారు. ఆగస్టుతో ఐటిఐ చదువు పూర్తయ్యాక సెప్టెంబర్ 18 నుంచి కంపెనీలో ఉద్యోగాల్లో చేరుతారని వెల్లడించారు. వీరికి జాయినింగ్ ఆర్డర్స్ అందించారని తెలిపారు.

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-సీతానగరం

ఆటో డ్రైవర్లు నిబంధనలు తప్పక పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లకు బుధవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. జిల్లాలో ఇప్పటికే 37 ఆటోలకు సరిగ్గా పత్రాలు లేకపోవడంతో అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు.

ఆర్‌జెడి ఆకస్మిక పరిశీలన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

విద్యాశాఖ విశాఖపట్నం రిజనల్ జాయింట్ డైరెక్టర్ బి. విజయభాస్కర్ బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న స్టూడెంట్ కిట్ల స్టాక్ పాయింట్‌ను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైన గురువారం నాటికే విద్యార్థులందరికీ కిట్లను అందజేయాలని ఆయన అధికార్లకు సూచించారు. ఇప్పటి వరకు ఏయే పాఠశాలలకు కిట్ల పంపిణీ చేసారని ఆరా తీశారు. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఏయే తరగతులకు ఏయే టైటిల్స్ వచ్చాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు స్టాక్ పాయింట్‌లో సామాగ్రిని అమర్చే విధానాన్ని పరిశీలించారు. అనంతరం విద్యా కానుకలకు సంబంధించి స్టాక్ రిజిస్టర్లను, రికార్డులను నిశితంగా పరిశీలించారు. స్టాక్ పాయింట్ నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందికి పలు

స్టూడెంట్ కిట్ల పంపిణీపై ఆరా

పుస్తకాలను పరిశీలిస్తున్న ఆర్‌జెడి విజయభాస్కర్

సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖధికారి ఎన్.ప్రేమ కుమార్, మండల విద్యాశాఖధికార్లు ఏ. రాజకుమార్, బి.పాపి నాయుడు విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల కిట్లను పాఠశాలలకు పంపించాలి

భోగాపురం: విద్యార్థులకు సంబంధించిన కిట్లను వెంటనే పాఠశాలలకు పంపించాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ్ భాస్కర్ అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలలకు వచ్చిన విద్యా కిట్లను భోగాపురంలోని మోడల్ పాఠశాలలో స్టాక్ పాయింట్ కింద ఏర్పాటు చేశారు. ఈ స్టాక్ పాయింట్‌లోని విద్యా కిట్లను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్‌తో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ స్టాక్ పాయింట్‌లో ఉన్న నోట్ పుస్తకాలు, టెక్స్ పుస్తకాలు, బ్యాగులను పరిశీలించారు. పాఠశాలలో తెరుస్తున్నందున వీటిని త్వరతగతిన పాఠశాలలకు పంపించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. మండల విద్యాశాఖ అధికారులు రమణమూర్తి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బోను బాగు చేస్తున్న సిబ్బంది

బోర్లు బాగు చేశారు..

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీలోని ఇందిరమ్మ కాలనీలో చేతిపంపు బోర్లను మున్సిపల్ అధికారులు బాగు చేశారు. కాలనీలో ఉన్న నాలుగు బోర్లు పాడైపోవడంతో మంచినీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ కాలనీలో మూలకు చేరిన బోర్లు కథనం ప్రజాశక్తిలో ప్రచురితం కావడంతో మున్సిపల్ అధికారులు స్పందించి పాడైపోయిన బోర్లను బాగు చేశారు. బోర్లు బాగు చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నైట్‌హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి - వేపాడ

మండలానికి నైట్ హాల్ట్ ఆర్‌టిసి బస్సులను ఏర్పాటు చేయాలని మండల వాసులు కోరుతున్నారు. కనీసం రెండు బస్సులను ఏర్పాటు చేస్తే మండల ప్రజలకు, విశాఖపట్నం, విజయనగరం ప్రయాణం సాగించే ఉద్యోగస్తులకు, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి పోయేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఆటోల వల్ల అధిక చార్జీలతో పాటు, రక్షణ కూడా లేకుండా పోతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తారన్న నమ్మకంతో ఎన్‌డిఎ కూటమి ఎమ్మెల్యేగా లలితకుమారిని, ఎమ్‌పిగా భరత్‌ను గెలిపించామని ప్రజలు నమ్మకానికి అనుగుణంగా విశాఖపట్నం నుంచి వేపాడకు నైట్‌హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఉదయం 5 గంటలకు వేపాడ నుంచి సోంపురం జంక్షన్ మీదుగా విశాఖపట్నం వరకూ ఆర్‌టిసి బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తే విశాఖపట్నంలో ఉద్యోగస్తులు, స్టీల్ ప్లాంటు, కేజీహెచ్, వివిధ ప్రైవేటు సంస్థలలో ఉద్యోగులతో పాటు ప్రతిరోజు కూలి పని చేసుకునే వారికి ఎంతో ఉపయోక్తంగా ఉంటుంది. విజయనగరం నుంచి కూడా ఒక నైట్ హాల్ట్ బస్సును ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే విశాఖపట్నం నుంచి కొత్తవలస మీదుగా వేపాడ నైట్‌హాల్ట్ బస్సులు రెండు నడుస్తున్నా వాటికి విపరీతమైన రద్దీ ఉంది. ప్రభుత్వం, ఆర్‌టిసి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వేపాడకు ప్రత్యేకించి రెండు నైట్‌హాల్ట్ బస్సులు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

హైవే కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన సిపి

ప్రజాశక్తి- భోగాపురం, డెంకాడ

జాతీయ రహదారిపై నాతవలస సమీపంలోని టోల్ గేటు వద్దనున్న హైవే కంట్రోల్ రూమ్‌ను విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. జాతీయ రహదారిలో ప్రమాదాలు జరిగేటప్పుడు ఎస్ఒఎస్ బాక్సులో ఉన్న బటన్ నొక్కితే సంబంధిత సమాచారం కంట్రోల్ రూమ్‌కి చేరుతుందని అప్పుడు వెంటనే తాము ఆ స్థలానికి చేరుకుంటామని ఆయనకు హైవే అధికారులు తెలిపారు. హైవేలో ఏర్పాటు చేసిన రాడార్లు పరిమితికి మించి స్పీడుగా వెళ్తున్న వాహనాలను గుర్తించి స్పీడ్‌తో పాటు సంబంధింత వాహనం ఫోటో కూడా కంట్రోల్ రూమ్‌కు చేర వేస్తుందని తెలిపారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ సిటీలో వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. వీటికి సంబంధించిన విధివిధానాలు తమకు తెలియజేయాలని

సీసీ టీవీలను పరిశీలిస్తున్న విశాఖ సిపి రవిశంకర్

హైవే అధికారులకు సూచించారు. హైవే పీడీ ప్రభాత్ రంజన్, డివిజనల్ మేనేజర్ సతీష్, స్థానిక మేనేజర్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను అంతం చేద్దాం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బాల కార్మిక వ్యవస్థను అంతం చేసేందుకు అందరం కలసికట్టుగా పనిచేయాలని డిస్ట్రిక్ట్ ఫోరమ్ ఫర్ చైల్డ్‌రైట్స్, ప్రజ్వల సంఘం, డిబిఎస్‌యు ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం డిబిఎస్‌యు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా 'బాల కార్మిక వ్యవస్థను అంతం చేద్దాం.. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే నేరం' అనే గోడపత్రికను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా పి.చిట్టిబాబు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత అని అన్నారు. 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా ప్రపంచంలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిస్తామని ప్రపంచ దేశాలు అంగీకరించాయని, అందులో భాగంగానే బాల కార్మికులు లేని దేశంగా, బాల కార్మికులు లేని రాష్ట్రంగా, బాల కార్మికులు లేని జిల్లాలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని అన్నారు. బాలలకు ఉన్న జీవించే హక్కు కాపాడాలని, బాలలను పనిలో పెట్టుకుంటే నేరమని, వారికి జైలు శిక్ష జరిమానా విధిస్తారని తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం జూన్ 30వ తారీఖు వరకు అవగాహన సదస్సులు, చైతన్య కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. బాలల సంక్షేమ సమితి సభ్యులు సురగాల చిట్టిబాబు మాట్లాడుతూ బాల కార్మికులను గుర్తిస్తే చైల్డ్ హెల్ప్ లైన్‌కు లేదా 1800102722 కు ఫోన్ చేసి చెప్పాలని కోరారు. కస్పా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రాయిపల్లి శంకర్రావు మాట్లాడుతూ. 18 ఏళ్లలోపు పిల్లలు నాణ్యమైన విద్యను పొందుతూ తమ జీవితాలను తీర్చిదిద్దుకునేలా తల్లిదండ్రులు సమాజానికి సహకరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో డిబిఎస్‌యు జిల్లా కార్యదర్శి రాయి ఈశ్వరరావు, చైల్డ్ రైట్స్ రెస్పాన్స్ సొసైటీ అధ్యక్షులు పి.సత్యవతి, డొమెస్టిక్ ఫోరమ్ కోఆర్డినేటర్ కె.వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ రైట్స్ జిల్లా చైర్మన్ చిట్టిబాబు

విజయనగరం: పోస్టర్ ఆవిష్కరిస్తున్న చిట్టిబాబు

బొబ్బిలి: మాట్లాడుతున్న జెసి రాజు

బొబ్బిలి : బాలకార్మిక వ్యవస్థ సామాజిక నేరమని దాని నిర్మూలన మనందరి బాధ్యతని రోటరీ క్లబ్ అధ్యక్షులు, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు పిలుపునిచ్చారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవ సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటిఐ)లో విద్యార్థులతో అవగాహన కార్యక్రమం, ర్యాలీ రోటరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జెసి రాజు మాట్లాడుతూ బాల్యం చాలా విలువైందని దాన్ని బతికించుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. బాలల చేత పనిచేయించటం, పనికి పెట్టుకోవటం చట్టరీత్యా నేరమన్నారు. ఇటుక బట్టీలల్లో, బైక్, సైకిల్ రిపేరు షాపుల్లో, స్వీట్ దుకాణాల్లో, షాపుల్లో, ఇంటిలో పనిమ నుషులుగా పిల్లలు పనిచేస్తున్నారని వారు వుండవలసింది బడిలో, పనిలో కాదని అన్నారు. ప్రతి బాలిక, బాలుడు తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లి నాణ్యమైన విద్యను పొందేలా చేయాలన్నారు. రోటరీ ప్రెసిడెంట్ ఎలెక్ట్ ఎస్.శ్రీనివాసన్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా తల్లి తండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బాల కార్మికుల విద్యకోసం అన్ని వసతులతో కూడిన పాఠశాలలను ప్రభుత్వం నెలకొల్పి నిర్వహించాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ రోటరీ సంస్థ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం కృషి చేస్తుందన్నారు కార్యక్రమంలో ఐటిఐ సిబ్బంది సిహెచ్ ప్రసాద్, ఎ.ప్రసాద్, హరికృష్ణ, రామకృష్ణ, శివకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా మంత్రిగా ఎన్నికవడం అభినందనీయం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎన్‌డిఎ కూటమి నుంచి గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికైన కొండపల్లి శ్రీనివాస్‌కి ఎపి క్యాబినెట్‌లో విజయనగరం జిల్లా నుంచి మంత్రి పదవి దక్కడం అభినందనీయమని జనసేన నియోజకవర్గ నాయకులు వబ్బిన సన్యాసి నాయుడు ఒక ప్రకటనలో అన్నారు. జిల్లా అభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేయాలని కోరారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో జనసేన ముఖ్య నాయకులు మంచిన జానీ, మల్లువలస నాని, ఎం. రమణ, దొరబాబు, కొల్లి సురేంద్ర, పట్రాన్ రవి తదితలు ఉన్నారు.

'పది' తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని చింతపల్లి ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుండి 10వ తరగతి క్లాసులు ప్రారంభిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. సుగుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాల గతేడాది ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ అయ్యింది. చింతపల్లి, పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుతున్నారని, అటువంటి విద్యార్థులు ప్రస్తుతం తమకు అందుబాటులో ఉన్న ఈ పాఠశాలలో 10వ తరగతిలో చేరాలని ఆమె కోరారు. ఈ పాఠశాలలో అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులు ఉన్నారని, ఈ మొదటి ఏడాది నుండే 10వ తరగతిలో మంచి ఉత్తీర్ణత శాతం సాధించడానికి సిబ్బంది అంతా అంకితభావంతో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తల్లిదండ్రులు తమ సేవలను వినియోగించుకోవాలని ఆమె కోరారు.

బొబ్బిలి: బొబ్బిలి కోట వద్ద మహిళలు సందడి

పూసపాటిరేగ: రెల్లివలసలో భోజనం చేస్తూ ప్రమాణ స్వీకారాన్ని తిలకిస్తున్న గ్రామస్తులు

అంబరాన్నంటిన ప్రమాణ స్వీకార సంబరాలు

రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, మంత్రిగా పవన్ కల్యాణ్‌తో పాటు మరో 23 మంది ప్రమాణ స్వీకారం చేయడంతో జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు సందడి చేశాయి. మండల కేంద్రాలతో పాటు ప్రధానమైన ప్రాంతాల్లో పెద్ద పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేసి అందరూ ఒకేచోట చేరి ప్రమాణ స్వీకారాన్ని తిలకించారు. బొబ్బిలి కోట వద్ద మహిళలు పెద్ద ఎత్తున చేరి సంబరాలు చేసుకున్నారు. పూసపాటిరేగ మండలంలోని రెల్లివలసలో ఎల్ఇడి టివి ఏర్పాటు చేసి అందరికీ భోజనాలు పెట్టారు. భోగాపురంలో జనసేన నాయకులు శ్రీనివాసరాజు కేక్ కట్ చేశారు. నెల్లిమర్ల కళ్యాణ మండపంలో ఎల్ఇడి టివి ఏర్పాటు చేశారు. పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేయడంతో ఎస్‌కోటలో నాయకులు, కార్యకర్తలు 1001 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకోవడంతో పాటు సంబంరాలు చేశారు.

- ప్రజాశక్తి యంత్రాంగం

భోగాపురం : కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు శ్రీనివాసరాజు

నెల్లిమర్ల: కల్యాణ మండపంలో ప్రమాణస్వీకారాన్ని చూస్తున్న నాయకులు

రేపు ప్రభుత్వ ఐటిఐలో ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో శుక్రవారం అప్రెంటిస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జివి రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మేధో సర్వో పరిశ్రమ యాజమాన్యం అప్రెంటిస్ ట్రైనీలు కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందన్నారు. 200 మందిని భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, వెల్డర్, మిషనిస్ట్ పూర్తి చేసి 14 ఏళ్లు నిండిన వారు ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.14200 స్టైఫండ్ ఇచ్చి డ్యూటీ సమయంలో సబ్సిడీపై టిఫిన్, భోజనం పెడతారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆధార్, రెండు పాస్ పోర్టు సైజ్ ఫోటోలు, ఒరిజినల్ సర్టిఫికేట్స్, అప్రెంటిస్ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని కోరారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-సాలూరు

బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ఐసిడిఎస్ ఆధ్వర్యాన నిర్వహించిన వీధి నాటకం ఆకట్టుకుంది. బుధవారం పట్టణంలోని బంగారమ్మపేట, బంగారమ్మ కాలనీ, చిన, పెదదళితపేటల్లో బేటీ పడావో.. బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా కళా బృందాలతో అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిడిపిఒ బి.సత్యవతి చెప్పారు. ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, బాల్యవివాహాలు చేయొద్దని సూచించారు. ఆడపిల్ల చదివితే ఇంట్లో వారంతా చదివినట్లవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు భారతి, తిరుపతమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా పూడికతీత పనులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వివిధ ప్రాంతాలలో చేపట్టిన పూడికతీత పనులను నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు బుధవారం పరిశీలించారు. సర్కిళ్ల వారీగా నిర్దేశించిన పూడికతీత పనులను గమనించి అవసరమైన సూచనలు సలహాలను ఇచ్చారు. కెఎల్ పురం, కంటోన్మెంట్, కణపాక తదితర ప్రాంతాలలో పర్యటించారు. ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను జెసిబిల సహాయంతో తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎంఎం నాయుడు మాట్లాడుతూ వర్షాలు కురిసే సమయంలో ప్రధాన కాలువల్లో వర్షపు నీరు సజావుగా ప్రవహించే విధంగా ఉండాలన్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లను ఇప్పటి నుంచే పూర్తి చేయాలని చెప్పారు. ప్రధాన కాలువల్లో పూడికతీత పనులను ముమ్మరం చేస్తున్నామన్నారు. అవసరమైతే మరింత మంది సిబ్బందిని ఏర్పాటు చేసి చెత్తాచెద్దారాలను తొలగించే కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. నగరంలో ఎక్కడ వర్షపు నీరు నిలవ లేకుండా నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ప్లాస్టిక్ కవర్లు, దుకాణాలలో వ్యర్థాలను కాలువల్లో వేస్తున్నట్లు తాము గమనించామని చెప్పారు. అటువంటి చర్యలను మానుకోవాలని లేకుంటే జరిమానాలు తప్పవని స్పష్టం చేశారు.

జెసిబితో మురుగును తొలగిస్తున్న సిబ్బంది

ప్రావీణ్యులకు రోటరీ సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగ, వ్యాపార రంగాలలో ప్రావీణ్యతను కనబరచిన వారికి రోటరీ పురస్కార్ కార్యక్రమంలో భాగంగా అవార్డుల ప్రదానోత్సవం బుధవారం జరిగింది. రోటరీ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్‌విఎన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులకు, వ్యాపార రంగంలో రాణించిన వారికి అవార్డులు అందజేశారు. సెంట్రల్ క్లబ్ అధ్యక్షుడు వి.వి.రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కన్స్యూమర్ కమిషన్ అధ్యక్షులు నాగ సుందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉద్యోగ వ్యాపార రంగాలలో విజయవంతంగా సేవలు అందిస్తున్న వారిని ప్రశంసించారు. సామాజిక అభివృద్ధిలో ఉద్యోగ, వ్యాపార వర్గాల పాత్ర క్రియాశీలకమైనదని పేర్కొన్నారు. మహేశ్వరి ఫ్లోర్ మిల్స్ యజమాని, హార్మోని కంపెనీ వ్యవస్థాపకుడు దిలీప్, ప్రొఫెసర్ డాక్టర్ కె.పుష్పనాథంను సత్కరించారు. పలువురు ప్రభుత్వ ఉద్యోగులను సత్కరించి, రోటరీ పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ అరుణ్ కుమార్ సౌధాని, వొకేషనల్ సర్వీస్ డైరెక్టర్ వి.ఎస్.కిరణ్ కుమార్, చైర్మన్ జి.జగదీష్, జయకృష్ణ, కాపుగంటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులను సత్కరిస్తున్న రోటరీ ప్రతినిధులు